ప్రజాశక్తి
గురువారం 9 జనవరి 2025

## అక్రమ అరెస్టులపై సిపిఎం ఖండన

**ప్రజాశక్తి-పాడేరు:** విశాఖలో బుధవారం ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో సిపిఎం నాయకులపై పోలీసుల నిర్బంధం, అక్రమ అరెస్టులపై సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వస్తున్న నేపథ్యంలో సిపిఎం నాయకుల్ని, కార్యకర్తలని గృహ నిర్బంధాలు, అక్రమ అరెస్టులు చేయడంతో పాటు, బల్క్ డ్రగ్స్ పార్కు నక్కపల్లిలో ఏర్పాటు చేయొద్దని ఆ ప్రాంతంలో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులపై నిర్బంధ కాండను ప్రయోగించ డాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అరెస్టు చేసిన నాయకుల్ని, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ప్రధాని మోడీ ప్రకటన చేయాలన్నారు. కాకినాడలో వద్దని అక్కడ ప్రజలు వ్యతిరేకించిన బల్క్ డ్రగ్స్ పార్కును నక్కపల్లిలో ప్రజలు వ్యతిరేకం చేస్తున్నా బలవంతంగా ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. మహిళలు అని కూడా చూడకుండా పోలీస్‌లు వారిపై దాడులు చేయడం అన్యాయమన్నారు.

# గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### -ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

**ప్రజాశక్తి-పాడేరు:** గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ ఆదేశించారు. ప్రతీ పాఠశాలలో ఒకే ప్రామాణికా విధానాన్ని అమలు చేయాలని చెప్పారు. పది విద్యార్థుల వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక పక్కాగా అమలు చేయాలని స్పష్టమై ఆదేశాలు జారీ చేసారు. సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో ఐటిడిఏ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జారీ చేసిన ఫార్మాట్‌లో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రతీ నెలా నివేదికలు సమర్పించాలని స్పష్టం చేసారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిక్ రూంలో ఉంచాలను సూచించారు. అత్యవసరమైతే వెంటనే అసుపత్రికి తరలించి తలిదండ్రులకు, ఎటిడబ్ల్యూఓలకు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థుల తలిదండ్రులకు, గార్డియన్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆదేశించారు. గుర్తింపు కార్డు కలిగిన వారితో విద్యార్థులను బయటకు పంపించాలని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో విధిగా మూమెంట్ రిజిష్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే తల్లిదండ్రులను, గార్డియన్లను అనుమతించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో విద్యార్థులను బయటకు పంపించకూడన్నారు. పది విద్యార్థుల వందరోజుల కార్యాచరణ ప్రణాళికను, స్టడీ మెటీరియల్‌ను విడుదల చేసారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల స్టడీ అవర్ నిర్వహించాలని చెప్పారు. వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దష్టి పెట్టి విద్యా సామర్థ్యాలు మెరుగు పరచాలని పేర్కొన్నారు. విద్యార్థులు గంజాయి వినియోగిస్తే తగిన చర్యలు చేపట్టి కౌన్సిలింగ్ ఇప్పించాలని, తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఆదేశించారు. మార్గదర్శిని కార్యక్రమం అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనపై కఠిన చర్యలు చేపట్టిందన్నారు. పాఠశాలలు, మండల స్థాయి, ఐటిడిఏ స్థాయిలో గంజాయి నిర్మూలనపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గంజాయి పండించినా తరలించినా, వినియోగించినా వెంటనే 1972 కాల్ సెంటర్కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డిఇ ఓ పి. బ్రహ్మాజీరావు, 11 మండలాల ఎటిడబ్ల్యూఓలు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఖాతాదారులు, సిపిఎం నేతలు

## స్టేట్ బ్యాంకు ఖాతాదారుల ఆందోళన

**ప్రజాశక్తి అరకులోయ రూరల్:** అరకులోయ స్టేట్ బ్యాంకులో సిబ్బంది లేక గత మూడు రోజుల నుండి సేవలు అందక పోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు అన్నారు. బుధవారం అరకులోయ స్టేట్ బ్యాంక్ వద్ద బ్యాంక్ ఖాతాదారులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యాంకులో పూర్తిస్థాయిలో సిబ్బంది లేక కేవైసీ, ఫోన్ నెంబర్ లింక్, జీరో అకౌంట్, ఇన్‌యాక్టివ్ అకౌంట్లు తదితర సేవలు అందించే సిబ్బంది లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నట్లు తెలిపారు.మూడు రోజులుగా వినియోగదారులు తమ వ్యవసాయ కూలీ పనులను విడిచిపెట్టి బ్యాంకు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా స్టేట్ బ్యాంకులో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.ఒకే కౌంటర్లో అన్ని రకాల పనులు చేస్తుండడంతో వినియోగదారులు గంటల తరబడి క్యూ లైన్లో నిలబడవలసిన వస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు, కుమ్మిడి రమేష్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు రగ్గుల పంపిణీ

**ప్రజాశక్తి-చింతపల్లి :** లంబసింగి పంచాయతీలో తిరుపతికి చెందిన పీపుల్ చారిటీ ఆర్థిక సహకారంతో నర్సీపట్నంకి చెందిన ఎస్ఏఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని లంబసింగి పంచాయతీ చెరువుల వినం, మేఘాలకొండ, బంతి బయలు, రింగుల మెట్ట, భీమనపల్లి, చీకటి మామిడి, టేకుబంధ, వాడగడ్డ గ్రామాల్లో సుమారు 400 మంది గిరిజనులకు దుప్పట్లను అందజేశారు. గిరి గ్రామాలలో గిరిజనులు చలి తీవ్రతతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించి పంపిణీ చేపట్టినట్లు ఎస్ ఏ ఎన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో లంబసింగి గ్రామ మాజీ సర్పంచ్ రఘునాథ్, గ్రామ పెద్దలు రావుల నూకరాజు, సరమండ నాగరాజు పాల్గొన్నారు.

రగ్గులు ఇస్తున్న సంస్థ నిర్వాహకులు

# ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలి

### సిపిఎం ఆధ్వర్యాన ఎడిఇ కార్యాలయం వద్ద ధర్నా

విద్యుత్ శాఖ ఎడిఇ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-చింతూరు**

2022-23 సంవత్సరంలో వాడిన విద్యుత్‌కు ట్రూ అప్ ఛార్జీల పేరుతో వినియోగదారుల నుండి అదనంగా రూ.16వేల కోట్ల మేరకు వసూలు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చింతూరు విద్యుత్ ఏడిఈ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, కార్యదర్శివర్గ సభ్యులు సీసం సురేష్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రూ.5900 కోట్లు విద్యుత్ పంపిణీ సంస్థకు లోటు రావడంతో ఆ లోటును వినియోదారుల నుండి వసూలు చేయాలని పంపిణీ సంస్థలకు ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచితే తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన టిడిపి కూటమి నేతలు నేడు ఆ హామీని తుంగలో తొక్కి విద్యుత్ చార్జీలు భారీగా పెంచడం దారుణమన్నారు. గత ప్రభుత్వం 1750 కోట్లు కమిషన్ తీసుకొని అదానితో చేసుకున్న సోలార్ విద్యుత్‌కు సంబంధించి లోపాయికారి ఒప్పందాలపై విచారణ చేయకుండా, కూటమి ప్రభుత్వం కూడా ఆ ఒప్పందాన్నే కొనసాగించడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్ల ఆలోచనలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. చింతూరు మండలంలో ఉన్న బలిమెల, చుక్కలపాడు, కొత్తూరు, చిన్న ఏడురాలపల్లి, పవర్‌లంక గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అనంతరం ఏడిఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పోడియం లక్ష్మణ్, కల్మల మల్లేష్, కారం సుబ్బారావు, చింతా రాంబాబు, సవలం కన్నయ్య, ముట్టం రాజయ్య, మొర్రం పెదగయ్య, సోడి లెనిన్, పల్లపు పెదరాములు, తెపల్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలకు కార్పెట్ల పంపిణీ

**ప్రజాశక్తి-రంపచోడవరం**

మారేడుమిల్లి, వై.రామవరం మండలాల్లోని మారుమూల ప్రాంతాల ప్రాథమిక పాఠశాలలకు కార్పెట్‌లను ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ బుధవారం ఐటిడిఎ కార్యాలయం వద్ద అందజేశారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, జిపిఎస్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులు చలికాలంలో కింద కూర్చొని చలికి తీవ్ర ఇబ్బంది పడుతున్న దృష్ట్యా చలికి తట్టుకునే విధంగా ఈ కార్పెట్స్‌ను అందిస్తున్నట్లు చెప్పారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ చొరవతో ఐటిడిఏ, ఐడిఎఫ్‌సి తుని బ్యాంకు ఆధ్వర్యంలో ప్రస్తుతం 80 మీటర్లు పొడవున్న ఆరు బండిల్స్ ఆయా మండలాల అధికారులకు అందజేసినట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ వై.రామవరం, మారేడుమిల్లి మండలాల్లోని మారుమూల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చలి వల్ల ఇబ్బంది పడుతున్న దృశ్యాలను స్వయంగా తాను పరిశీలించడం జరిగిందని చెప్పారు. కార్పెట్స్ ఏర్పాటు చేయాలని ప్రాజెక్ట్ అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు ముత్యాలరావు, వై.వెంకటరమణ, ఎంపీడీవో కె.బాపన్నదొర, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఇంజనీర్ నాగరాజు, ఐడిఎఫ్సి ఫస్ట్ తుని బ్యాంక్ మేనేజర్ ఎస్వీఎస్ఎన్.మూర్తి, సహాయకులు ఎ.కాజా, అఖిల్ రెడ్డి, వై.రామవరం, మారేడుమిల్లి మండలాల గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కార్పెట్‌లు అందిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ తదితరులు

# కలెక్టర్ సుడిగాలి పర్యటన

పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :** మండలంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ బుధవారం ఆకస్మికంగా సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో మొదటిగా సుజన కోట గ్రామ పంచాయతీలో పర్యాటకుల కేంద్రం ఏర్పాటుపై పరిశీలించారు. డుడుమ పర్యాటక ప్రాంతంలో పర్యటించారు.అనంతరం పంచాయతీ పరిధిలో లడ్డ గ్రామంలో ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం మోడల్ హై స్కూల్ పాఠశాల భవనాలను పరిశీలించారు. నత్తనడకన కొనసాగుతున్న భవనాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు.

**బినామీలకు పర్యాటకాన్ని అప్పగిస్తే ఊరుకోం**

**ఆదివాసి గిరిజన సంఘం మండల**

బినామీలకు పర్యాటక ప్రాంతాన్ని అప్పగిస్తే ఊరుకోమని ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ సభ్యుడు సొలగం గాసిరం దొర తెలిపారు. మండలంలోని రిజర్వాయర్ ముప్పు ప్రాంతంలో నివాసిస్తున్న ఆదివాసి గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలన్నారు. రిజర్వాయర్ ముప్పుకు గురై వ్యవసాయ సాగు భూములు నష్టపోయిన కుటుంబాల వారికి పర్యాటక కేంద్రాలు ఏర్పాటు చేయక ముందే ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన మత్స్యకారులకు వలలు, బోట్లు ఉచితంగా సరఫరా చేయాలన్నారు. రిజర్వాయర్ ప్రభావానికి గురై భూములు కోల్పోయిన గిరిజన రైతుల కుటుంబానికి 35 కిలోల బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తూ, సబ్సిడీ రుణాలు మంజూరు చేసి గిరిజన మత్స్యకారులకు ఆదుకోవాలన్నారు. పర్యాటక ప్రాంతం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని ప్రైవేట్ వ్యక్తులకు, బినామీలకు ప్రభుత్వం కేటాయిస్తే ఆ ప్రాంత గిరిజనులతో తీవ్రమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

**ప్రజాశక్తి-పాడేరు:** జిల్లా ప్రధాన కేంద్రమైన పాడేరు పంచాయతీలో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా రోడ్డు మార్జిన్లలో నిర్వహిస్తున్న కూరగాయలు దుఖాణాలను రైతు బజార్‌కు తరలించడానికి వ్యాపారులు సహకరించాలని పాడేరు డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశము మేరకు బుధవారం ఉదయం ఈవో ఆర్డీ రమేష్‌తో కలసి రైతు బజార్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాపారులకు రైతు బజార్ లో కేటాయించిన షాపులలో మాత్రమే వ్యాపారాలు కొనసాగించాలని కోరారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలోని స్థానిక రైతు బజార్ ను గ్రామ పంచాయతీకు అప్పగించినందున రైతు బజార్లో అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు జిల్లా కలెక్టర్‌కి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ కూడలి రోడ్డు మార్జిన్లలో వ్యాపారాలకు అనుమతి ఇవ్వవద్దని డివిజనల్ పంచాయతీ అధికారి ఆదేశించారు.

దుకాణదారులతో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ

నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

## హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలి

### ఆదివాసీ గిరిజన సంఘం నిరసన

**ప్రజాశక్తి-చింతపల్లి:** చింతపల్లి, కొయ్యూరు మండలాల సరిహద్దు ప్రాంతంలో నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైన హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్‌తో కలిసి చింతపల్లి మండల కేంద్రంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటలను చేతబోని నిరసన చేపట్టారు.నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు ఉపాధి కలిగించే జీవో 3 వెంటనే పునరుద్ధరించి డీఎస్సీలో గిరిజన యువతికు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. హైడ్రోపవర్ ప్రాజెక్టుతో గిరిజన గ్రామాలను చిన్నాభిన్నం చేయడం తగదన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ ఇప్పటివరకు చేయలేదన్నారు. గిరిజన హక్కులను కాలరాసే హక్కు ప్రభుత్వాలకు ఎవరిచ్చారని మండిపడ్డారు.గిరిజన హక్కులు, చట్టాలకు లోబడి గ్రామ సభల తీర్మానంతోనే హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణంపై ముందుకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి పడాల్, ఆదివాసి గిరిజన సంఘం సభ్యులు మజ్జి రాంబాబు, కిల్లో సింహాచలం, పాంగి చిన్నారావు, మర్రి కామేశ్వరరావు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిగా చెల్లించాలి

### - కాలయాపన చేస్తే ఉద్యమిస్తాం
### - సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

**ప్రజాశక్తి-విఆర్.పురం**

పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ తక్షణమే చెల్లించాలని, ముంపు భూములకు పరిహారం ఇవ్వాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. మండలంలోని పెద్దమటపల్లి గ్రామంలో పంకు సత్తిబాబు అధ్యక్షతన బుదవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ నిర్వాసితుల పరిస్థితి ఏమిటో అర్థం కాని స్థితికి పాలకులు తీసుకువెళ్లారని, పూర్తిగా ఆర్ అండ్ ఆర్ ఇవ్వలేదని తెలిపారు. నిర్వాసితుల భూముల ప్యాకేజీ నేటికీ చెల్లించకుండా కాలయాపన చేయడం, భూమికి భూమి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మొదటి ముంపు గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి పూర్తిస్థాయిలో ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని, నష్టపరిహారాలు చెల్లించి పునరావాసం కల్పించాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల నాయకులు కారం సుందరయ్య, తుర్రం బాబురావు, తోడం రాజు, కదల కొండారెడ్డి, కారం సత్తిబాబు, గుండెపుడి లక్ష్మణరావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, జల్లి సత్యనారాయణ, శ్రీరపుతాతబాబు, పొడియం శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ తహశీల్దారు జనార్ధన్‌రావు

**ప్రజాశక్తి-దేవీపట్నం**

మండలం ఇందుకూరు ఎంపీపీ స్కూల్ ఎదురుగా ఉన్న ప్లే గ్రౌండ్లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను బుధవారం దేవీపట్నం మండల డిప్యూటీ తాసిల్దార్ పి.జనార్దన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటగాళ్లు స్నేహభావంతో ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంత వాతావరణంలో టోర్నమెంట్‌ను జయప్రదం చేయాలని కోరారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు కీర్తిశేషులు సిద్ధబత్తుల భాస్కరరావు జ్ఞాపకార్థం, ద్వితీయ బహుమతి రూ.5వేలు కీర్తిశేషులు సిద్ధబత్తుల శశిరేఖ, మూడో బహుమతి రూ.3వేలు కీర్తిశేషులు గొడ్డలి సత్యనారాయణ, సీల్డ్ బహుమతులు కీర్తిశేషులు సింబోతుల నాగకుమారి, కీర్తిశేషులు దూసరి బాబురావు గార్ల జ్ఞాపకార్థం ఈ నెల13వ తేదీన అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్.రవి, ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, జగన్, బండారు వీరబాబు, సింబోతుల దుర్గాప్రసాద్, తెల్లం శేఖర్, కారం రామన్న దొర, డి.హరిబాబు, కె.శ్రీధర్, సిహెచ్.విద్యాసాగర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నందిగామ పంచాయతీ అవకతవకలపై విచారణ జరపాలి

**ప్రజాశక్తి-ఎటపాక :** మండలంలోని నందిగామ గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అవకతవకలు జరిగాయని, దానిపై విచారణ జరపాలని నందిగామ ఉపసర్పంచ్ పులుసు బాలకృష్ణ, వార్డ్ మెంబర్ కందుల సతీష్ మంగళవారం ఎంపీడీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 2024 జనవరి నుండి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ నిధులు రూ.12లక్షల ఖర్చు చేసారని, ఇందుకు గాను సర్పంచ్, వార్డ్ మెంబర్స్‌తో ఎటువంటి సమావేశం ఏర్పాటు చేయలేదని తెలిపారు. సమావేశ హాజరు పట్టికలో కూడా వార్డ్ మెంబర్ల సంతకాలు పోర్జరీ చేసి తీర్మానాన్ని ఆమోదించుకున్నారని పేర్కొన్నారు. 2023-2024, 2024-2025 ఆర్థిక సంవత్సరాల్లో రూ.14 లక్షలకు పైగా 15వ ఆర్థిక సంఘం నిధులు వార్డ్ మెంబర్స్‌కు సమాచారం ఇవ్వకుండా, ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేయకుండా ఖర్చు పెట్టారని తెలిపారు. ఇందులో గ్రామ అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. ఈ విషయంపై పూర్తి సమాచారం కొరకు నెల రోజులుగా పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని ప్రయత్నించినా గ్రామ సచివాలయానికి రావడం లేదని ఆరోపించారు. కావున పంచాయతీ నిధుల దుర్వినియోగం, అవకతవకలపై ఉన్నతధికారులు విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతిపత్రం ఇస్తున్న ఉప సర్పంచ్ బాలకృష్ణ

100వ రోజు దీక్షలో కూర్చున్న వివిఎస్.పద్మనాభరాజు తదితరులు

## పోర్టు హాస్పిటల్ టెండర్‌కొస్తే అడ్డుకుంటాం

### 100వ రోజు దీక్షలో పద్మనాభరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ టెండర్ పేరుతో ఎవరొచ్చినా అడ్డుకుంటామని విశాఖ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు హెచ్చరించారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం నాటికి 100వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రయివేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని గుర్తుచేశారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం అనర్థమని తెలిపారు. విశాఖ అభివృద్ధికి వైజాగ్ పోర్టు కీలకమని, ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతున్న పోర్టును ప్రయివేటుకు ధారాదత్తం చేయడం అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందని చెప్పారు. ఆసుపత్రి ప్రయివేటీకరణకు టెండర్లను వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. కార్మిక వర్గ పోరాట ఫలితంగానే వాయిదా వేశారని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం అన్యాయమని, ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే, కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, రామలింగేశ్వరరావు, కెఎస్.కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు 10న ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 10వ తేదీన గాంధీ పార్కు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఎం.రాంబాబు పిలుపునిచ్చారు. జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన గాజువాక సిఐటియు కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది మున్సిపల్ కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన ఒప్పందాలను కూటమి ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా అమలు చేయలేదన్నారు. గొలగాని అప్పారావు మాట్లాడుతూ, సమ్మె కాలపు ఒప్పందాల జిఒలు జారీచెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబును, మున్సిపల్ శాఖామంత్రి పి.నారాయణను, ఉన్నతాధికారులను యూనియన్ నాయకులు పలుమార్లు కలిసి విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ సమావేశంలో గొల్ల రాము, నక్క నాగరాజు, వై.చిన్నారావు, ఎస్.గణేష్, మీనాక్షి, వరలక్ష్మి, సత్యవతి, పాల్గొన్నారు.

## కూర్మన్నపాలెంలో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్

ప్రజాశక్తి -ఉక్కునగరం : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు బుధవారం కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.మురళీధర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చిత్ర దర్శకులు ఎం.సేనాపతి మాట్లాడుతూ వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూస్వాముల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడి అమరుడైన దొడ్డి కొమరయ్య చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య చిత్ర యూనిట్ సభ్యులు ఎస్‌కె.అబ్దుల్‌రెహమాన్, తక్కళ్లపల్లి విజయకుమార్, రావుల శ్రీనివాస్, నాగరాజు, మద్ది అప్పలరెడ్డి, ఉక్కు తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్.బలరాం, వి.సహదేవ్ పాల్గొన్నారు.

# పలుచోట్ల రెవెన్యూ సదస్సులు

హుకుంపేటలో ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు జైప్రకాష్ మాట్లాడారు. గిరిజనేతరులు చేపట్టిన అక్రమ నిర్మాణాలపైనా, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తహశీల్దారుకి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు టి క్రిష్ణారావు, ఎస్.హైమావతి మాట్లాడుతూ, మండల కేంద్రంలో గిరిజనేతరులు విపరీతంగా అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. వాటిపై అనేక మార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినట్టు వారు తెలిపారు. కనీసం ఒక్క అక్రమ నిర్మాణం కూడా ఆపలేదన్నారు. రెవెన్యు అధికారులు ముడుపులు పుచ్చుకొని భినామీలకు కొమ్ముకాస్తూ నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నానారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండలరావు, ఎంపీటీసీ రమా, ఆర్ఐ సీతమ్మ, మండల సర్వేయర్ సింహాచలం, పీసా ఉపాధ్యక్షులు, సిపిఎం నాయకులు గెమ్మెలి ఆనంద్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, వీఆర్ఓ రత్న కుమారి పాల్గొన్నారు.

అనంతగిరి:రెవిన్యూ సదస్సులతో దీర్ఘకాలికంగా నిలిచిన భూ సమస్యలకు పరిష్కార మార్గం సాధ్యపడుతుందని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్ మాణిక్యం, గుమ్మకోట సర్పంచ్ పాగి. అప్పారావు తెలిపారు. బుధవారం స్థానిక శివాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీటి రామూర్తి, ఆర్ఐ.శంకర్రావు, విఆర్ఓ. కోటిబాబు, ఎంపిటిసి. తవిటినాయడు, మాజి ఎంపిటిసి. కొండమ్మ పాల్గొన్నారు

అనంతగిరిలో....

# దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి -అనంతగిరి: కాఫీ రైతులు దళారులను ఆశ్రయించి మోస పోవద్దని, ఐటీడీఏ లేదా. జిసిసి సంస్థలకు అమ్మకం చేపట్టాలని గుమ్మకోట సేల్స్ మెన్, అనంతగిరి ఇన్చార్జి. డి.అప్పన్నదొర కోరారు. అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో సందర్శించారు. కాఫీ పంట, దిగుబడి, నష్టాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు.మాలింగవలస, అనంతగిరి, తాడిగుడ గ్రామాల్లో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. అనంతగిరి, డమ్ముకు, ఎగువశోభ, బొర్రా. వంటి ప్రధాన కేంద్రాలలో జిసిసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మెన్ కె.అప్పలస్వామి పాల్గొన్నారు.

# క్రికెట్, వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి -జి.మాడుగుల

మండలంలో వంజరి పంచాయితీ కిముడుపల్లి గ్రామంలో బుధవారం క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకట రమేష్ నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కోడ వెంకట సురేష్ కుమార్, రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమల చిట్టిబాబు, సీనియర్ నాయకుడు శోభ శ్రీనివాస్, ఖాన్, మాజీ ఎంపిటిసి కె ప్రకాశరావు, కృష్ణ, మత్యరాజు, గెమ్మెలి దేముడు పాల్గొన్నారు.

టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు

## నేరాలు ఘోరాలు

## వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

### వ్యాను, ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలోని చింతలూరు లోతుగడ్డ జంక్షన్ ఇటికల బట్టి వద్ద బుధవారం తెల్లవారుజామున కోళ్ల వ్యాను బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు... నర్సీపట్నం జయశ్రీ యజమానికి చెందిన వాహనం నర్సీపట్నం నుంచి నుంచి జీకే వీధి మండలం సీలేరు ప్రాంతానికి కోళ్లు సరఫరా చేసి తిరిగి నర్సీపట్నం వెళుతుంది. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం పొగ మంచు కారణంగా కనిపించకపోవడంతో జాతీయ రహదారి రక్షణ గోడకు వ్యాను ఢీకొని బోల్తా పడింది. బోల్తా పడిన కోళ్ల వ్యానును జెసిబి సహాయంతో రోడ్డుపైకి తీశారు.

జిమాడుగుల :మండలంలో రచ్చపల్లి గ్రామ సమీపంలో జి.మాడుగుల క్రసర్ నుండి కంకర్ లోడుతో వెళుతున్న ట్రాక్టరు రచ్చపల్లి మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది ఈ సంఘటనలో డ్రైవర్ మత్స్యలింగంకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాల దగ్ధం

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని బస్కి పంచాయితీ బిజ్జగూడ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. బిజ్జగూడ గ్రామంలో నివాస ముంటున్న పీవిటిజి కుటుంబానికీ చెందిన కిల్లో పొల్లు కుటుంబ సభ్యులు పని నిమిత్తం బయటకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది.బుధవారం ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ మీటర్ నుంచి మంటలు చెలరేగి ఇంటిలో సామాగ్రిలు, మంచం ఖాళి బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి వేశారు.ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికీ ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సమర్డి బాబూరావు, సోడేపల్లి, ఆనందరావు, రామచందర్, భాస్కరరావు, గురుమూర్తి డిమాండ్ చేశారు.

## 200 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-చోడవరం : ట్రాక్టర్ తొట్టి కింద అరలో అమర్చి తరలిస్తున్న 200 కేజీల గంజాయిని చోడవరం పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అల్లూరి జిల్లా పెదబయలు మండలం నుండి ట్రాక్టర్ వస్తున్నట్లు గమనించిన పోలీసులు చోడవరం కొత్తూరు జంక్షన్‌లో తనిఖీ చేశారు. ఆ ట్రాక్టర్ తొట్టి కింద అరలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. అందులో ఉన్న 200 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలు పోలీసులు వెల్లడించవలసి ఉంది.

### స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి మద్దతుగా...

## భెల్ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ నిరసన

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా భెల్‌లోని ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యాన భెల్ మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన తెలిపారు. ప్రధాని విశాఖ వచ్చిన సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని చెప్పాలని డిమాండ్ బ్యాడ్జీలను ఉద్యోగులకు పంపిణీ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు జిటిపి.ప్రకాష్ మాట్లాడుతూ, గతంలో బిహెచ్‌పివి ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు జరిగిన పోరాటాల్లో స్టీల్ కార్మికులు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. బిహెచ్‌పివిని భెల్‌లో విలీనం కోసం చేసే ప్రతి పోరాటంలో స్టీల్ కార్మికులు పాల్గొని సంఘీభావం తెలియజేశారని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి భెల్ కార్మికులు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.బాబూరావు, ఎస్.జగన్నాథరావు, వి.ఆనందరావు, పి.కనకారావు, సీతనాయుడు, కె.కేశ్య, ఎన్.వెంకట్రావు పాల్గొన్నారు.

## పీసా కమిటీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న కొమ్మిక వాసులు

ప్రజాశక్తి-కొయ్యూరు :కొమ్మిక పంచాయతీ పరిధి కొప్పుకొండ, కొత్త తుమ్మల బంధ, పాత తుమ్మలబంధ, రేవళ్ళు, కొమ్మిక, ఊర్లొద్ది, తాళ్ళపాలెం 7 గ్రామాల పీసా కమిటీలకు మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కొమ్మిక పంచాయతీ ప్రజలు ఎంపీడీవో ఎస్‌కెవి ప్రసాద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార హక్కు చట్టం కో ఆర్డినేటర్ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 3న జరిగిన ఎన్నికల్లో కోరం లేకుండా గిరిజనేతరులకు ప్రాధాన్యత ఇస్తూ ఎన్నికలు నిర్వహించారని తెలిపారు. గిరిజన ప్రాంతంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా, చట్టాలను హరిస్తూ ప్రజలకు సమాచారం అందించకుండా ఎన్నికల అధికారులు, రాజకీయ నాయకులు ఏకపక్షంగా ఎన్నికలు జరిపారని ఆరోపించారు. కోరం లేకపోయినా పీసా ఎన్నికల అధికారులు ఎన్నికలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, ఎన్నికల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మాతె గణేష్, కొమ్మిక పంచాయతీ యూనిట్ ఇన్చార్జి గాలి చిన్నారావు, కొప్పు దేవుడు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని శ్రీరామగిరి శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని నిర్వహించే తెప్పోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం ముక్కోటి ఉత్సవ కమిటీ సభ్యులు పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారి ఆలయం నుండి ఉత్సవ మూర్తులను పల్లకిలో గోదావరి నదిపై ఏర్పాటు చేసిన హంస వాహనంపై ఆశీనులు గావించనున్నారు. వెళ్లు మార్గం గోదావరి స్నాన ఘట్టాలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జయప్రదం చేయాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి కే.కాంతారావు, ఉత్సవ కమిటీ సభ్యులు పెందుర్తి సుదర్శన్‌రావు, నాలారపు సత్యనారాయణ, కోట్ల రామ్మోహన్ రెడ్డి, ఆలయ అధికారులు సాయిబాబు, జనసేన నాయకులు ములకాల సాయికృష్ణ, బాగుల అంజన్‌రావు, ఆత్మకూరు కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ అప్పలరాజును కలిసిన సిపిఎం నాయకులు



ఎస్ఐ అప్పలరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఎటపాక : ఎటపాక పోలీస్ స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్ఐ అప్పలరాజు ను సిపిఎం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతలు నెలకొనేందుకు తమ వంతు సహకారం అందిస్తామని సిపిఎం నేతలు తెలిపారు. ఎస్ఐని కలిసిన వారిలో పార్టీ మండల కార్యదర్శి కాకా అర్జున్, కార్యదర్శి వర్గ సభ్యులు ఐవి, నాయకులు సవలం రాము, నక్కా సూరిబాబు, ఆసు ప్రసాద్, పూనెం వెంకట్రావు వున్నారు.

## తోటి వారికి సాయంలో ఆనందం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఇతరులకు సాయం చేయడంలో ఆనందముంటుందని బాల వికాస ఫౌండేషన్ సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. బీచ్ రోడ్డు బుక్కా వీధి బాల వికాస ఫౌండేషన్ బ్రిడ్జి స్కూలు ఆవరణలో సంఘ సేవకురాలు అన్నమ్మ ఆర్థిక సాయంతో 45 మంది మహిళలకు సంక్రాంతి కానుకగా చీరలు పంపిణీ చేశారు.

# 'హెచ్‌ఎంపివి' పై ఆందోళన వద్దు..!

### విశాఖ కెజిహెచ్‌లో20 పడకలతో ప్రత్యేక వార్డు : సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపివి) వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, ఐసిఎంఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, డిఎంఇ ఆదేశాల మేరకు కెజిహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక ఐసోలేషన్ వార్డు సిద్ధం చేశామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద వెల్లడించారు. అవసరమైన వైద్యులు, సిబ్బంది, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈసందర్భంగా వైరస్ లక్షణాలు, వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన చెప్పిన వివరాలివి.

**వైరస్ ఏలా వ్యాప్తి చెందుతుంటే...**

న్యూమో విరిలే కుటుంబానికి చెందిన ఈ వైరస్ కరోనా తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై ప్రభావం చూపుతుంది. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల ద్వారా వారితో సన్నిహితంగా ఉన్న వారికి, కరచాలనం, స్పర్శ, ముద్దుల వంటి చర్యలతో ఇతరులకు సోకుతుంది. వైరస్ ఉన్న ఉపరితలాలను తాకిన తరువాత అదే చేతితో నోరు, ముక్కు, కళ్లను తాకితే శరీరంలోకి ప్రవేశిస్తుంది. వైరస్ సోకిన తర్వాత 3 నుంచి 10 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి.

డాక్టర్ పి.శివానంద, కెజిహెచ్ సూపరింటెండెంట్

**వైరస్ లక్షణాలు ఇవే**

సాధారణ జలుబు మాదిరిగానే దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు వైరస్ సోకిన వారిలో కనిపిస్తాయి. న్యూమోనియా, బ్రాంకటిస్ (ఆస్తమా) వంటి శ్వాసకోశ సమస్యలకు దారి తీస్తుంది. చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కేన్సర్, హెచ్ఐవి, కీళ్లవాతం, స్టెరాయిడ్స్ వాడిన వారిలో, సిఒపిడి ఉన్న వారిలో,వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ వైరస్ తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఏడాదిలోపు వయస్సున్న పిల్లలకు ఎక్కువగా వస్తుంది. రెండోసారి వస్తే ప్రభావం తీవ్రంగా ఉంటుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

హెచ్‌ఎంపివి నివారణకు కొవిడ్ తరహాలోనే ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. రద్దీ ప్రాంతాలకు వెళితే మాస్క్ ధరించడం ఉత్తమం. వైరస్ లక్షణాలున్న వారు ఐసోలేషన్‌లో అప్రమత్తంగా ఉండాలి. సొంత వైద్యం మాని, వెంటనే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని తగిన వైద్యం పొందాలి. పండుగ సీజన్ కావడంతో షాపింగులు, రద్దీ ప్రాంతాలకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలి. సబ్బులు, శానిటైజర్లతో చేతిని శుభ్రం చేసుకోవాలి. వ్యాధి లక్షణాలున్న వారి వస్తువులు వేరొకరు వాడరాదు. ఎటువంటి యాంటీ బయాటిక్ మందులు వాడరాదు. వ్యాధి నిర్ధారణకు కొవిడ్ మాదిరిగానే ముక్కు,గొంతు ద్వారా శాంపిల్స్ సేకరించి పరీక్షిస్తారు. ఎటువంటి ముందస్తు వ్యాక్సిన్ లేదు

**కెజిహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు**

ప్రభుత్వ ఆదేశాలతో అప్రమత్తమై కెజిహెచ్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేశాం, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. కెజిహెచ్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంతవరకు ఎటువంటి కేసు నమోదు కాలేదు.

## వలస ఆదివాసీ గ్రామాలకు / విద్యుత్, రహదారుల సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-చింతూరు :చింతూరు ఐటిడిఏ పరిధిలో వలస ఆదివాసి గ్రామాల ప్రజానీకానికి రోడ్లు, కరెంటు వంటి మౌలిక సౌకర్యం కల్పించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన 21 వలస ఆదివాసీ గ్రామ పెద్దలు బుధవారం చింతూరు ఐటిడిఏ పిఓ అపూర్వ భరత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలు, వలస ఆదివాసీల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల సందర్భంలో అనేక హామీలు ఇస్తూ గెలిచాక మర్చిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ అనేక గ్రామాలలో కరెంటు, రహదారులు వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలస ఆదివాసి గ్రామాలలో 40 ఏళ్లు పైబడి జీవిస్తున్న వలస ఆదివాసీలకు కనీస హక్కులు, సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. నేటికీ గ్రామాలలో పాఠశాల, అంగన్వాడీ నిర్వహణ అర కొరగానే ఉన్నాయని, షెడ్లు, పాకలలో నిర్వహణ చేస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెన్షన్, ఇతర సౌకర్యాలకు కూడా నోచుకోవడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేసి వలస ఆదివాసి ప్రజానీకానికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పోడియం లక్ష్మణ్, ముట్టం రాజయ్య, సోడ్ లెనిన్, కూర భీమయ్య, రవ్వ జోగారావు, కారం సుబ్బారావు, మనోజ్, మూర్రం, పీడగయ్య, శవలం పంతులు, మడివి ఐతమ్మ, కుంజ రమణి, గ్రామ పెద్దలు మడివి దీపక్, కూంజ జోగారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పిఒకు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన గిరిజన గ్రామాల పెద్దలు

## 'యంగ్ ఇండియా'లో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :'యంగ్ ఇండియా కే బోల్' సీజన్5 కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. దేశ యువత కోసం సత్యం, న్యాయం, సమానత్వం కోసం పోరాడుతున్నామన్నారు కోరారు. ఆంధ్రాలోని యువత ఈ వెబ్‌సైట్‌కు వీడియోలు పంపాలని, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మరాజు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్కరాజు రామారావు, శివకుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాభివృద్ధికి సహకరించాలి

మండల సభలో మాట్లాడుతున్న ఎంపిపి లలితకుమారి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి అందరూ సహకరంచాలని ఎంపిపి లలిత కుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ లలిత కుమారి అధ్యక్షతన మండల పరిషత్తు సాధారణ సమావేశం జరిగింది. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమణలకు గురైన మారేడుమిల్లి ప్రధానకూడలిని సరిచేయాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యాటకులకు కేంద్ర బిందువుగా ఉన్న మారేడుమిల్లిలో అక్రమ రిసార్ట్స్ పుట్టగొడుగులలా వెలిసాయని, వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న పదవ తరగతి పరీక్షలలో ప్రభుత్వ పాఠశాలలో చదివి మొదటి ర్యాంకు మార్కులు సాధించే విద్యార్థికి మండల సాధారణ నిధుల నుండి రూ.5000 చొప్పున పరితోషగాకం ఇవ్వడానికి సమావేశం తీర్మానించింది. కార్యక్రమంలో జడ్పీటీసీ గొర్లె బాలాజీ బాలు, ప్రత్యేక అధికారి చైతన్య, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్సులు పాల్గొన్నారు.

## 402 మంది డ్రాపౌట్ బాలికల గుర్తింపు

బాలికలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలో కౌమార దశలో పాఠశాల నుండి డ్రాప్ అవుట్ అయిన బాలికలను 402 మందిని గుర్తించామని కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టు అధికారి ఏ.లక్ష్మీదేవి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి.రోహిణి వెల్లడించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు బుధవారం 102 మంది బాలికలతో సమావేశమై బాల వివాహాల వల్ల కలిగే అనర్ధాలు నష్టాలు గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. మధ్యలోనే విద్యను నిలిపివేసిన బాలికలకు మళ్లీ విద్యను ప్రారంభించడానికి, వాళ్ల జీవనోపాధి మెరుగుపర్చుకొనే అవకాశాలపై వివరించారు. బాలికలకు ఎటువంటి శిక్షణపై ఆసక్తి ఉందో వాళ్ల ద్వారా తెలుసుకున్నట్లు అధికారులు తెలిపారు.

## బస్సుల కొరతతో ప్రయాణికులకు ఇక్కట్లు

ప్రజాశక్తి-కొయ్యూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బుధవారం విశాఖపట్నం పర్యటనకు ఆర్టీసీ బస్సులను మళ్లించడంతో కొయ్యూరు మండలానికి ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నర్సీపట్నం, పాడేరు, రాజమండ్రి నుండి వచ్చే సర్వీసులతో పాటు కొయ్యూరు, మంప, బూదరాళ్ల బంధమామిళ్ళు, గంగవరం తదితర గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు వ్యయ ప్రయాసలుకోర్చి ఆటోలు, వ్యాన్లు తదితర వాహనాల్లో ప్రయాణించి నానా అవస్థలు పడ్డారు. పండుగ నేపథ్యంలో తీవ్ర రద్దీ ఉన్న సందర్భంలో తమ ప్రాంతానికి వచ్చే ఆర్టీసీ సర్వీసులను పూర్తిగా నిలిపివేయడంపై పలువురు ప్రయాణికులు వ్యాపారస్తులు ప్రభుత్వంపై మండిపడ్డారు.